క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ సబ్‌స్టేషన్ పరిధిలో దెబ్బ తిన్న విద్యుత్ స్తంభాలను మార్చనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఎండాడ పెట్రోల్ బంక్ పరిధి, ఎస్‌బీఐ, పోలమాంబ గుడి, సిరిగుడినగర్, వీవీ నగర్, దసపల్లా లే అవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కనులపండువగా శ్రీవారి రథోత్సవం



రథంపై ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి రథోత్సవం కనులపండువగా జరిగింది. భీమిలిలోని పెద్దబజారు, చిన్నబజారు ప్రాంతాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం ఉదయం అర్చకులు పురాణం శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం జరిగాయి. ఇందులో భక్తులు, ఆలయ ట్రస్టీలు పాల్గొన్నారు.

భూసారం కోసం మట్టి నమూనాల సేకరణ

తగరపువలస: మండలంలో రైతులంతా రైతు సేవా కేంద్రం ద్వారా మట్టి నమూనాలు ఇచ్చి భూసార పరీక్షలు చేయించుకోవాలని ఆనందపురం మండల వ్యవసాయాధికారిణి చావా సంధ్యా రత్నప్రభ కోరారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేల సారాన్ని, నేలలో పోషకాల లభ్యతను తెలుసుకోవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతు యొక్క ఆధార్, 1బీ వివరాలు తనిఖీ చేస్తారన్నారు. రైతులంతా రైతు సేవా కేంద్రంలో తమ ఆధార్, భూమి వివరాలు తనిఖీ చేయించుకోవలసిందిగా ఆమె కోరారు.

18న మెగా జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని యాక్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ బి.రాజారావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను కళాశాల ప్రతినిధులతో కలసి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 20 కంపెనీలకు పైగా పాల్గొని, అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జీవీ ప్రభాకర్ రావు, ఎస్.జంగాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'కేకేఆర్ గౌతమ్' ప్రతిభ

తగరపువలస: సీబీఎస్ఈ పదో తరగతి, +2 పరీక్షా ఫలితాలలో ఆనందపురం కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని గౌతమ్ గ్రూప్ చైర్మన్ కె.కె.ఆర్, డైరెక్టర్ అవినాష్, కరస్పాండెంట్ వి.వి.ఎస్.ఎన్ తెలిపారు. జిల్లాలో తమ టెన్త్ విద్యార్థులు 78.14 శాతం, +2 విద్యార్థులు 77.58 శాతం ఏవరేజ్‌తో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. టెన్త్ విద్యార్థి ఆర్.వివేక్ 97.6 శాతంతో ప్రథమ స్థానంలో, వీవీ రఘురామ్‌రెడ్డి 97.4, ఎం.బాలకృష్ణ మనోహర్ 97 శాతంతో తరువాత స్థానాల్లో నిలిచారన్నారు. +2లో కె.గౌతమ్ 94 శాతంతో ప్రథమ స్థానంలో.. పి.యామిని, జి.మాధురి, ఎస్.సుదర్శన్ శ్యామ్ 93.8 శాతంతో తరువాత స్థానాలు సాధించారన్నారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కె.వీరరాఘవయ్య, కె.వెంకటరమణమూర్తి, ఎ.వేణుగోపాలకృష్ణ, పి.వైకుంఠరావు, డీన్ కె.శేషుబాబు, క్యాంపస్ ఇంచార్జ్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డీపీఎస్' ముందంజ

తగరపువలస: ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలలో తమ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతతో ముందంజలో ఉన్నారని ఆనందపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైస్ చైర్మన్ రేవంత్ విశ్వనాథ్ తెలిపారు. రిత్విక్ సింఘాల్ 489, తేజల్ రాయ్ 480, తేజాక్షయ 475, దర్శజైన్ 472, తులసి వర్షన్ 471 మార్కులు సాధించారన్నారు. 90 శాతం కంటే ఎక్కువ మార్కులు 24 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు.

దయా గుణం.. తీరుస్తోంది దాహం..

మండుటెండలో ప్రయాణిస్తుంటే సూర్యుడు మన శక్తిని స్ట్రాతో పీల్చేస్తున్న భావన. ఆ సమయంలో కాస్త గొంతు తడిస్తే చాలు అనిపిస్తుంది. అలా ఎండన పడి ప్రయాణించే వారి దాహాన్ని తీరుస్తున్నాయి చలివేంద్రాలు. సాధారణంగా ఈ మండు వేసవిలో అడుగు బయటకు పెట్టేందుకు కూడా చాలామంది సాహసించడం లేదు. అత్యవసరమైతే ఎన్నో జాగ్రత్తలు తీసుకుని వెళ్లి, పని త్వరగా ముగించుకుని వచ్చేస్తున్నారు. కానీ, కొందరు సేవా మూర్తులు మాత్రం వడదెబ్బ, వయోభారాన్ని కూడా లెక్క చేయడం లేదు. మానవ సేవే మాధవ సేవ అన్నరీతిలో రోడ్లపై చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, వృద్ధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, భక్తులు ఎందరో ఈ బృహత్కార్యంలో భాగస్వాములవుతున్నారు. వారి దయాగుణంతో ప్రయాణికుల దాహం తీర్చుతున్నారు. - మధురవాడ

మధురవాడలో చలివేంద్రాల ఏర్పాటు
ప్రయాణికులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ
సేవాపథంలో స్థానికులు



వుడా కాలనీలో రోడ్డుపై ప్రయాణికుల వద్దకు వెళ్లి మరీ మజ్జిగ అందజేస్తున్న సాయి సేవకులు

దుర్గాలమ్మ ఆలయం వద్ద ఆరేళ్లుగా..

చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా క్రమం తప్పకుండా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దాతలు, భక్తుల సహాయ సహకారాలతో అత్యధిక రోజుల్లో మజ్జిగ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు, పాదచారులతో పాటు సర్వీసు రోడ్డుతో పాటు, హైవేలో రాకపోకలు సాగించే వారికి ఈ చలివేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది.



దుర్గాలమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు, కమిటీ సభ్యులు

సాయి భక్తుల సేవానిరతి

మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ సాయి భజన మండలి ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు చెందిన సాయి భక్తులు ఆరేళ్లుగా క్రమం తప్పకుండా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ భక్తులు రోడ్డుకు ఇరువైపులా పాదచారులు, ప్రయాణికులకు కొసరి మరీ మజ్జిగ అందిస్తూ, దాహార్తి తీరుస్తున్నారు.



మిథిలాపురి వుడా కాలనీలో సాయి భక్తులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

సాయి శక్తితోనే..



సంకల్పం మాది.. శక్తి సాయిది. అందుకే ఎంతో వయసు పైబడిన వారు సైతం ఇక్కడ సేవ చేయగలుగుతున్నారు. మా భజన మండలిలో 50 కుటుంబాలు ఉన్నాయి. వారితో పాటు ఇతర భక్తుల సహకారంతో క్రమం తప్పకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. 2019 నుంచి ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. కరోనా సమయంలోనూ మజ్జిగ, ఆహారం పంచాం.

– ఎం.మురళి, వుడా కాలనీ సాయి భజన మండలి

అందరి సహకారంతో..



మా దుర్గాలమ్మ ఆలయ కమిటీ ఎటువంటి సేవా కార్యక్రమాలు చేయాలని సంకల్పించినా వెంటనే గ్రామ పెద్దలు, భక్తులు, దాతలు కూడా అదే స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. వారి సహకారంతోనే గత ఆరేళ్లగా క్రమం తప్పకుండా చలివేంద్రం నిర్వహించగలుగుతున్నాం. హైవేలో వెళ్లే వేలాది మందికి, భక్తులకు ఉపయోగపడుతోంది. అదే మాకు ఆనందం.

– పిళ్లా సూరిబాబు, అధ్యక్షుడు, దుర్గాలమ్మ ఆలయ కమిటీ

దేవుడిచ్చిన అవకాశమిది..



మా వారు జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యారు. నాకు పెన్షన్ వస్తుంది. నా ఖర్చులు పోనూ మిగిలిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటాను. చలివేంద్రాల నిర్వహణ, పేద జంటల వివాహానికి సాయం వంటివి చేతనైనంతలో చేస్తున్నా. మా నాన్నగారు, మా వారు కూడా ఇలాంటివి ప్రోత్సహించేవారు. ప్రస్తుతం మా పిల్లలు కూడా అన్ని విధాలా సహకరిస్తున్నారు. ఇది దేవుడిచ్చిన అవకాశంగా భావిస్తున్నా.

– జొన్నలగడ్డ రాజ్యలక్ష్మి, సీనియర్ సిటిజన్, మిథిలాపురి వుడా కాలనీ

ఐదేళ్ల నుంచి బంగారమ్మ ఆలయం వద్ద..



పంపిణీ కోసం మజ్జిగ సిద్ధం చేస్తున్న బంగారమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు

మధురవాడ హైవేలో చంద్రంపాలెం హైవే సర్వీసు రోడ్డును ఆనుకుని ఉన్న బంగారమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. గ్రామస్తులు, భక్తులు, దాతల సహాయ సహకారాలుతో వారానికి మూడు, నాలుగు రోజులు మజ్జిగ, మిగిలిన రోజుల్లో మంచినీరు పంపిణీ చేస్తున్నారు.

ఇదే బాటలో మరికొంతమంది..

- జీవీఎంసీ 7వ వార్డులో దుర్గానగర్ సైట్స్ అండ్ బిల్డింగ్స్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..
- మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో తన తండ్రి కమ్యూనిస్ట్ నాయకుడు నాగోతి సింగన్న జ్ఞాపకార్థం కొద్ది సంవత్సరాలుగా మేడే తర్వాత నుంచి చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.
- జీవీఎంసీ 5వ వార్డు హైవేను ఆనుకుని పరదేశిపాలెం వద్ద గల ఓ గ్రానైట్ సంస్థ క్రమం తప్పకుండా ఎనిమిదేళ్లుగా ఎండల ప్రారంభంతోనే చలివేంద్రం ఏర్పాటు చేస్తోంది.
- మారికవలసలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏడేళ్ల నుంచి హైవేను ఆనుకుని శాశ్వత స్థాయిలో పందిళ్లు ఏర్పాటు చేసి, చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

.. ఇలా ఎందరో సేవాతత్పరులు పదుల సంఖ్యలో చలివేంద్రాలు నిర్వహిస్తూ, ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు.

సబ్సిడీపై పంపిణీకి పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

పద్మనాభం: రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు 80.2 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం తెలిపారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీలుగ 54 క్వింటాళ్లు, జనుము 22 క్వింటాళ్లు, పిల్లి పెసర 4.2 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతుసేవా కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకుని కేంద్రాలకు వెళ్లి, విత్తనాలు పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 1బీ, ఆధార్ కార్డు తీసుకుని వెళ్లాలన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే ముందు రైతులు భూసార పరీక్ష చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చలం తెలిపారు. రైతులు తమ పొలంలోని మట్టి నమూనాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేస్తే, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ల్యాబ్‌లో వచ్చిన ఫలితాలను రైతులకు కార్డుల ద్వారా తెలియజేస్తామన్నారు.

వివాదాస్పద భూమిలో నిర్మాణ పనుల అడ్డగింత



జీవీఎంసీ సిబ్బంది నిర్మాణ పనులు నిలుపుదల పార్కు స్థలం ఇదే

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో వివాదంలో ఉన్న పార్కు స్థలంలో తుప్పల తొలగింపు, నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం కళానగర్‌లో ఎల్‌పీ లే అవుట్‌లో ఉన్న సుమారు 90 సెంట్ల పార్కుకు సంబంధించిన భూమి తమదంటూ ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లాడు. దీంతో ఈ వ్యవహారం కొంతకాలంగా వివాదంలో ఉంది. బుధవారం కొందరు వ్యక్తులు ఈ పార్కు స్థలంలో ఉన్న డొంకలు, తుప్పలు తొలగించి షెడ్ నిర్మాణానికి పూనుకున్నారు. స్థానికులు ఫిర్యాదు ఇవ్వడంతో టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ శ్రీనివాస్ ఎవిక్షన్ స్క్వాడ్‌తో వచ్చి పనులు నిలుపుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ స్థలం వివాదం కోర్టులో ఉందని, అందుకే ఇక్కడ పనులు నిలుపుదల చేయించామని చెప్పారు. ఇందులోకి ఇరువర్గాలు వెళ్లటానికి అవకాశం లేదన్నారు.

జమ్మి చెరువు పార్కు పరిశీలన



పార్కును పరిశీలిస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలో ఉన్న జమ్మిచెరువు పార్కును జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి వాకర్లు పార్కు నిర్వహణ, పర్యవేక్షణ గురించి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్కు పర్యవేక్షణ మరింత బాగా జరగాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. ఇక్కడ చెరువులో బోట్‌షికారు ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయని, అది అమలు జరిగే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జెడ్సీ స్పందిస్తూ పార్కు పరిసరాలు మరింత చక్కగా ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. బోట్ షికారు గురించి అధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు.

విద్యార్థులకు హిందీ సర్టిఫికెట్ల అందజేత



హిందీ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆదర్శ ప్రేమీమండలి ప్రతినిధులు

తగరపువలస: ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో జరిగిన హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆదర్శప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో లోయర్, హయ్యర్ సర్టిఫికెట్లను అందించారు.

పార్కు ప్రహరీపై డెబ్రిస్ భారం



పార్కులో ప్రహరీని ఆనుకుని వేసిన డెబ్రిస్

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంతపేట చిల్డ్రన్స్ పార్కును చుట్టుపక్కల వారు డెబ్రిస్ వేసే డంపింగ్‌యార్డుగా మార్చేశారు. ఇప్పటికే గొల్లవీధి వైపు ప్రహరీని ఆకతాయిలు కూల్చేయడంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఆకతాయిలు పార్కులో తిష్ట వేసి జీవీఎంసీ పాఠశాల, జిమ్‌తో పాటు చుట్టుపక్కల ఇళ్లకు నష్టం కలిగిస్తున్నారు. ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాల నుంచి పెట్రోల్, టైర్లు, బ్యాటరీలు దొంగిలిస్తున్నారు. దీంతో జీవీఎంసీ నుంచి ఎలాంటి రక్షణ లేని పార్కుకు స్థానికులు మరింత నష్టం కలిగిస్తున్నారు. డెబ్రిస్‌ను పార్కు ప్రహరీని ఆనుకుని వేయడంతో గోడ ఒక వైపు వాలిపోయింది. దీంతో గోడకు అవతలి రోడ్డుపై నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలపై ఈ ప్రహరీ ఎప్పుడైనా కూలుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీపై డెబ్రిస్ భారాన్ని తొలగించి ఈ ప్రాంతంలో చిన్నారులు ఆడుకునేందుకు స్థలాన్ని సిద్ధం చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రహరీకి మరమ్మతులు చేసి, ఆకతాయిలు ప్రవేశించకుండా గేటు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఛత్రపతి శంభాజీ మహరాజ్‌కు నివాళి



శంభాజీ మహరాజ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పీఎం పాలెం: పీఎం పాలెంలోని రెండో బస్టాపు వద్ద ఛత్రపతి శంభాజీ మహరాజ్ జయంతిని స్థానిక నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శంభాజీ మహరాజ్ వీరునిగా సాధించిన ఘన విజయాలు, ఆయన దేశభక్తి గురించి వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చక్రవర్తి, జీఆర్ ఎస్ఎన్ రాజు, సత్యసాయి, కోస్టు రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పాకెట్ మనీతో చలివేంద్రం



మ్యాంగో జ్యూస్ పంపిణీ చేస్తున్న విద్యార్థులు

మధురవాడ: మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం (సెక్షన్–2) విద్యార్థులు బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాదచారులు, విద్యార్థులు సుమారు 1000మందికి మ్యాంగో జ్యూస్, తర్వాత చల్లని నీరు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు తమ పాకెట్ మనీతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

6 వేల వాటర్ బాటిళ్ల వితరణ

తగరపువలస: భీమిలిలో జరుగుతున్న ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా తగరపువలసకు చెందిన సాయి రవీంద్ర పాఠశాల యాజమాన్యం రూ.40వేల విలువైన ఆరు వేల వాటర్ బాటిళ్లను బుధవారం అందించింది. కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ చేతుల మీదుగా వీటిని ఆలయ చైర్మన్ కలిగొట్ల సూర్యనారాయణ, స్నిగ్ధశ్రీ ఫౌండేషన్ అధినేత కలిగొట్ల శ్రీరామమూర్తికి అందజేశారు.

రోడ్డును మూసేశారు..



మట్టితో మూసేసిన రోడ్డు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లోని ఎల్ఐజీ గృహ సముదాయం (వుడా)కు వెళ్లే మార్గాన్ని ఓ వ్యక్తి పూర్తి స్థాయిలో మట్టితో కప్పి మూసేశారు. ఇక్కడ సదరు వ్యక్తి ఉన్న నివాసాన్ని ఆనుకుని ఖాళీ స్థలం ఉంది. దానిని ఆక్రమించుకుని కలుపుకొనేందుకు చుట్టూ భారీ గోతులు తవ్వేశారు. ఆ మట్టిని రాకపోకలు సాగించే రోడ్డుపై వేసి, పూర్తిగా మార్గం మూసేయడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ పరిసర ప్రాంతాల్లో గృహ సముదాయాలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని లక్షల్లో కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. వుడా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఖాళీ స్థలాలను పరిరక్షించాలని కోరుతున్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

చంద్రంపాలెం హైస్కూల్ వద్ద హైవే పై తొలగనున్న ఇక్కట్లు



చంద్రంపాలెం హైస్కూల్ వద్ద హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతం

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరగడం.. పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న సుమారు 4500మంది విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పీపీపీ పద్ధతిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుకు సాగలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాటు తాత్సారం చేస్తూ వచ్చింది. తాజాగా జీవీఎంసీ సాధారణ నిధులు రూ.3.23కోట్లతో 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణం పూర్తయితే విద్యార్థులతో పాటు వేలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

అద్దెకు కమ్యూనిటీ హాల్



కమ్యూనిటీ హాల్లో విద్యార్థుల సామాగ్రి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని గొల్లలపాలెంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాలును కొందరు దర్జాగా అద్దెకు ఇచ్చేశారు. సాధారణంగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన కమ్యూనిటీ హాలును అక్కడి ప్రజలు శుభకార్యాలు, సమావేశాలకు వినియోగిస్తారు. ఇందుకోసం అక్కడ నిర్వహించనున్న కార్యక్రమాల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, వారి అనుమతి తీసుకున్న అనంతరం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ పెద్దలుగా చెప్పుకునే కొందరు, అధికారులకు తెలియకుండా ఇటీవల ఈ భవనాన్ని అద్దెకు ఇచ్చేశారు. ఇక్కడ సమీపంలో నిరుద్యోగులకు శిక్షణ అందించే ఒక సంస్థ వద్దకు అనేక మంది శిక్షణకు వచ్చారు. వారు ఉండడానికి ఇది అనువుగా ఉండడంతో ఇక్కడి కొందరు, పెద్దలను సంప్రదించగా వారు అధికారులకు చెప్పకుండా ఇచ్చేశారు. దీనికోసం వీరు డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు తీవ్రంగా వచ్చాయి. దీనిపై జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడును వివరణ కోరగా తమకు తెలియకుండా కమ్యూనిటీ హాలును ఇలా ఇవ్వడం ఏమాత్రం సరికాదని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పార్కులో అక్రమ నిర్మాణం

- చోద్యం చూస్తున్న పట్టణ ప్రణాళికా విభాగం
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



అశోక్ నగర్ పార్కులో నిర్మాణంలో ఉన్న షెడ్

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పార్కులకు రక్షణ కొరవడింది. కొద్దిరోజుల క్రితం స్వతంత్రనగర్ పార్కులో కొందరు వ్యక్తులు దర్జాగా అక్రమ నిర్మాణాలకు పూనుకోగా.. తాజాగా ఆరో వార్డు పరిధి పీఎం పాలెం అశోక్‌నగర్ లుంబినీ పార్కు ప్రహరీని విరగ్గొట్టి మరీ ప్రభుత్వ భూమిని ఆక్రమించేస్తున్నారు. సుమారు రూ.40 లక్షలు విలువ చేసే 50 గజాల మేర ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, దుకాణం కోసం షెడ్ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు పీజీఆర్ఎస్‌లో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. వీరు అక్రమార్కులతో కుమ్మక్కవడం వల్లనే వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పార్కు స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.